

ముగిసిన 'తెలుగు వెలుగు' కార్యక్రమం



కళాకారులను సత్కరించిన దృశ్యం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులు పాటు పిటిఎం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు వెలుగు కార్యక్రమాలు గురువారం ముగిశాయి. గిడుగు జయంతి ప్రారంభం నుంచి ఇప్పటివరకు సాంస్కృతిక కార్యక్రమాలు తెలుగు వెలుగులు పేరు మీద సంస్థ అధ్యక్షులు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు సారధ్యంలో లలిత కళారూపాలను ప్రదర్శించారు. చివరి రోజు జరిగిన కార్యక్రమంలో చిత్రకారుడు డాక్టర్ కె.వర్మ, పంచాయతీ కార్యదర్శి బి.గోవిందరావు, లైబ్రేరియన్ ఎ.వెంకటనారాయణ, సింగర్ ఎం.రాజేశ్వరి ఘనంగా సత్కరించారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు కాలుష్య నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు వాతావరణంలో వచ్చే మార్పులు మానవుని ఆరోగ్యం పట్ల ఏ విధమైన ప్రభావాలు చూపుతాయన్న అంశంపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పు మానవ ఆరోగ్య ప్రభావాల మీద జాతీయ కార్యక్ర మాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని తెలిపారు. జాతీయస్థాయిలో వాతావరణం మార్పు అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించ డం జరిగిందన్నారు. ఆ విధివిధానాలు సక్రమంగా అమలు అయ్యే రీతిలో టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ పర్యవేక్షించాలని ఆదేశించా రు. వాయు, జల కాలుష్యాలు నియంత్రణతో పాటుగా గ్రీనరీ డెవలప్మెంట్ కు పక్కాగా చర్యలు చేపట్టి ఆ యొక్క వాతావరణ మార్పులు ప్రభావం మానవులపై అంతగా పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఆరోగ్యకరమైన వ్యవస్థలు బలోపేతానికి చర్యలు తీసుకుంటూ ఆరోగ్యకర పరిస్థితులు నెలకొనేలా ముందస్తు జాగ్రత్త చర్యలను పటిష్టంగా చేపట్టాలన్నారు. అటవీశాఖ సముద్రతీరం వెంబడి మడ అడవుల పెంపకాన్ని ప్రోత్సహించి సముద్రపు కోత నుండి తుఫాన్లు బారిన పడకుండా రక్షణ కవచంగా ఉండేలా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు రవాణా శాఖ కాలుష్య నియంత్రణకుగాను సిఎన్జి ఎలక్ట్రికల్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహిం చాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి మున్సిపల్ కమిషనర్లు తరచుగా వాయు జల కాలుష్యం దాని మూలాలు, రకాలు అన్వేషణ కొరకు నమూనాలు సేకరించి, విశ్లేష ణలు చేస్తూ కాలుష్య నియంత్రణకు పటిష్టమైన చర్యలు గైకొనడంతో పాటుగా పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరిచి సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలన్నారు. మున్సిపల్ అధికారులు పురపాలక సంఘాల పరిధిలో మొక్కలు ఎక్కువగా పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ సురక్షిత మైన సాగునీటిని అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించి ప్రత్యామ్నాయం గా పర్యావరణ హిత సాంప్రదాయ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించా లన్నారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వినీల ప్రియాంక మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం ప్రతి ఏడాది వాతావరణ మార్పులు మూలంగా సంక్రమిస్తున్న వ్యాధుల ముందస్తు నివారణ చర్య లు పటిష్టంగా అమలు చేయా లని సూచించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, డిపిఒ వి.కష్ణకు మారి, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసు బాబు, డిఇఒ ఎం.కమల కుమారి, డిఎఫ్ఒ ఎంవి.ప్రసాద్ రావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిని జివి. సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన'పై అవగాహన

గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు ఈ పథకం అమలుకు సంబంధించి జిల్లా స్థాయి అమలు కమిటీ అధికారులతో అవగాహన సమావే శం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించి అమలు తీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17న ప్రారంభమయ్యే ఈ పథకంపై పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. తొలుత ఈ పథకంపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవ డంతోపాటు లబ్ధిదారులు ఆన్లైన్లో నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ టి.మురళి, అసిస్టెంట్ మేనేజర్ శివరాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్జెడ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం

జిల్లాలో సముద్ర తీర ప్రాంతం వెంబడి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల కు వ్యతిరేకంగా ఇసుక రీచ్ లు ఆక్వా చెరువులు ఏర్పాటు చేయరాదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సి ఆర్ జెడ్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వ హించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలానుగు ణంగా సవరించబడిన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నోటిఫికేషన్లోని నిబంధనలను అతిక్రమించి చేపడుతున్న అక్రమ ఇసుక మైనింగ్, ఆక్వా చెరువులు ఏర్పాటు వంటివి గుర్తించి నష్టపరిహారాలు విధిస్తామన్నారు.



అమలాపురం బ్యాంక్ వీధిలో రిక్షా కార్మికులతో సిపిఎం నాయకులు

ప్రజలపై పెనుభారం మోపుతోన్న కేంద్రం

- సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు
- కరపత్రాలు పంపిణీ చేస్తూ ధరలు తగ్గించాలని డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నులుభారాన్ని మోపుతోందని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. పెరుగుతున్న విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువులు, నిరుద్యోగంపై సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలో ఆగష్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు పలు నిరసనచేపట్టామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రాల హక్కులనుహరిస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబడుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యపరిష్కరించాలని, అధిక ధరలను అదుపు చేయాలని, సరసమైన ధరలకు నిత్యావసరాలు అందించాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలని సిపిఎం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు. రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు హద్దు అదుపు లేకుండా ఆకాశాన్నంటుతున్నాయని పేదలు, మధ్యతరగతి ప్రజానీకం ధరల కోరల్లో చిక్కుకుపోతున్నారని అన్నారు.ఈ పరిస్థితి మారాలంటే యావన్మంది ప్రజానీకం ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేస్తున్న పన్నుల భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. ఈ సందర్భంగా అమలాపురం బ్యాంక్ వీధిలో సిపిఎం నాయకులు ప్రచార జాత నిర్వహించారు. పలు దుకాణాలు తోపుడుబండ్ల వ్యాపారస్తులు రహదారుల ప్రయాణించే వాహనదారులకు రిక్షా కార్మికులకు కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వంకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధరలు తగ్గించాలని నిరుద్యోగం రూపుమాపాలని కోరారు.విద్యుత్ ఛార్జీలు పెరగడంతో రాష్ట్రవ్యాప్తంగా ఏదో ఒక మూల ప్రజలు విద్యుత్ బిల్లులను తగలబెడుతునే వున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు గుదే దుర్గాప్రసాద్, కె.కష్ణవేణి, సి.రామచంద్రరావు, టి. శ్రీరామమూర్తి, బి.సత్యనారాయణ, జి.దైవవాణి, శంకర్ ప్రణీత్ సాయి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీచేస్తున్న సిపిఎం నాయకులు

మంత్రి విశ్వరూప్ తనయునికి నిరసన సెగ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ కు గడప గడపకు కార్యక్రమం లో నిరసన సెగ తగిలింది.మీ మీద కోపం లేదు.మీ తండ్రి తమపై అక్రమంగా కేసులు పెట్టించారు.మా బిడ్డలను మూడు నెలలు జైలులో పెట్టించారు. మీ ఇంటి దహనాలు మాకు సంబంధం ఏమిటి. అధికారం ఉంది కదా అని అమాయకులు ను ఇరికిస్తే చూస్తూ ఊరుకోం అంటూ స్థానికులు శ్రీకాంత్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమలాపురం రూరల్ మండలం కామనగరువు లో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా విత్తనాల వారి కాలవగట్టు ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. శ్రీకాంత్ వారిని సముదాయించెందుకు ప్రయత్నించారు. కేసులు పెట్టించి మళ్ళీ మా ఇంటి ముందుకు ఎందుకు వచ్చారు అంటూ ప్రశ్నించారు. తాను ప్రభుత్వ కార్యక్రమం వివరించేందుకు వచ్చానని నన్ను అర్థం చేసుకొండని శ్రీకాంత్ స్థానికులకు నచ్చ చెప్పారు. ఇంతలో స్థానిక జడ్పిటిసి పందిరి శ్రీహరి, వైసీపీ నాయకులు నక్క చంద్రశేఖర్, నక్క సంపత్ లు జోక్యం చేసుకొని వారికి నచ్చ చెప్పడంతో సద్దుమణిగింది. పోలీస్ ల సహకారంతో శ్రీకాంత్ తన కారులో అక్కడనుండి వెనుతిరిగారు. జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు.



శీకాంత్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రాగ్రూప్ సభ్యులు

న్యాయం చేయాలని డ్వాక్రా సభ్యుల వినతి

ప్రజాశక్తి-కొత్తపేట

తమ గ్రూపుపేరుతో వేరు వ్యక్తులు రుణం తీసుకున్నారని, దీనిపై విచారణ న్యాయం చేయాలని మండల పరిపాలనా అధికారికి రామకృష్ణ డ్వాక్రా గ్రూప్ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. వివరాలు ఇవి.. మండల పరిధిలోని ఏనుగు మహల్ గ్రామానికి చెందిన రామకష్ణ డ్వాక్రా గ్రూప్ సభ్యులు బ్యాంక్ ఆఫ్ బరోడాలో లోను తీసుకున్నట్లు వాయిదాలు చెల్లించలేదని బ్రాంచ్ మేనేజర్ అడగడంతో మాకు ఆ లోనికి ఎటువంటి సంబంధం లేదని డ్వాక్రా సభ్యులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిపాలన అధికారికి గురువారం వినత పత్రం అందజేశారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరారు ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ యూనియన్ బ్యాంకులో రూ.10లక్షలు లోను తీసుకుని వాయిదాలను సక్రమంగా నిర్వహించు కుంటున్నారని అన్నారు. అయితే.మా గ్రూప్ పేరున మరో రూ.10 లక్షలు వేరే వ్యక్తులు తీసుకున్నారని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ వాయిదాలు చెల్లించలేదని గ్రూపు సభ్యులకు తెలియపరచడంతో మేము తీసుకున్నది యూనియన్ బ్యాంకులోని వేరే లోను గాని వేరే బ్యాంకులో గాని మా గ్రూపు సభ్యులు ఎవరు తీసుకోలేదని తెలిపారు.



నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు కొనసాగించాలి

ప్రజాశక్తి-మండపేట

రిజిస్ట్రేషన్ అన్ని పాత పద్ధతిలో స్టాంపులు ద్వారా కొనసాగించాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేఖర్లవ్యవస్థ బ్రిటీష్ కాలం నుంచి 1906లో ఏర్పాటు చేశారని, నేటి వరకు కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం నూతనం గా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 వల్ల దస్తావేజు లేఖర్ల వ్యవస్థను నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 296సబ్ రిజిస్టర్ ఆఫీసుల్లో 30 వేల మంది లేఖర్లు, సహాయకులు, స్టాంపు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు ఉన్నారన్నారు. వీరంతా రోడ్డును పడే అవకాశం ఉందన్నారు. ప్రైమ్ 2.0 వ్యవస్థ వల్ల పూర్వం బ్రిటిష్కాలం నాటి దస్తావేజు పోయి తెల్ల కాగితంపై దస్తావేజులు వచ్చాయ అన్నారు. ప్రైమ్ 2.0 వ్యవస్థ వల్ల భూమిని అమ్ముకునే రైతుకు భూమిని కొనుక్కునే రైతుకు ఈమెయిల్ఐడి, ఆధార్ కార్డులకు ఒటిపిలు తప్పనిసరిగా ఉండాలనినిబంధనలు ఉన్నాయి. చిన్నరైతులకు పల్లెటూరులోఇటువంటి నిబంధన వల్ల రిజిస్ట్రేషన్లు ఆగిపోయి, వారికి మరింత కష్టాలు పెట్టే వ్యవస్థగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రైమ్ 2.0 వ్యవస్థను రద్దు చేయాలని కోరారు.



'శ్రీనివాస' ఇంజినీరింగ్ కళాశాల్లో మాట్లాడుతున్న ఎస్పి శ్రీధర్

విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-కాట్రేనికోన

నూతనంగా కళాశాల్లో ప్రవేశించిన విద్యార్థులు ఆధునిక సాంకేతికతలో వస్తున్నటు వంటి వినూత్న మార్పు లనుగుణంగా ఆధునిక పరిజ్ఞా నాన్ని అందిపుచ్చు కోవాలని ఎస్పి శ్రీధర్ అన్నారు. చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో 2023 - 24 విద్యా సంవత్సరపు మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ (బిటెక్) తరగతుల్ని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ డివిఎస్ఎస్. వర్మ, ముఖ్యఅథితిగా విచ్చేసిన జిల్లా ఎస్పి శ్రీధర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వర్మ ప్రసంగిస్తూ కళాశాలలో గల మౌలిక వసతులు వినియోగించుకొని ప్రతీ విద్యార్థి పరిశోధకునిగా రూపుదిద్దుకోవాలని ఆకాక్షించారు. మరొక ముఖ్య అతిథి డిఎస్పి ఎం.అంబికా ప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్వియస్.పరమేశ్వర రావు, పాలక వర్గ సభ్యులు రమేష్ రాజు, సందీప్ లు, కళాశాల డైరెక్టర్ వాసుదేవరావు, కళాశాల విద్యాశాఖాధికారిని యస్.జయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సెక్షన్ 30 అమలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలు చేస్తున్నామని డిఎస్పి ప్రసాద్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు నిషేధాజ్ఞలు అమలు లో ఉంటాయన్నారు. ఈ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు సమావేశాలు ఊరేగింపులు వంటివి జరగడానికి వీల్లేదనీ తెలిపారు. పోలీసు సబ్డివిజన్ పరిధిలో ఉన్నటువంటి రామచంద్ర పురం, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, రాయవరం, అంగర, పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రాంతాలకుఇది వర్తిస్తుందన్నారు. రామచంద్రపురం పోలీస్ సబ్డివిజన్ పరిధిలో ఉన్నటు వంటి ప్రాంతాల్లో 1 నుంచి సెక్షను 30 పోలీస్ యాక్ట్ ఉత్తర్వులు అమలులో ఉంటాయని, వీటి ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదని, అటువంటివి జరపాలంటే రామచంద్రపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారి వద్ద ముందుగా అనుమతి పొందవలసి ఉంటుందని సూచించారు. ఈ నిషేధాజ్ఞలు ఈనెల ఆఖరు వరకు ఉంటాయి. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

వలియా సేవలు నిరుపమానం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ర్యాలి నెంబర్ ప్రాథమిక పాఠశాలలో ఎంటిఎస్ టీచర్గా పనిచేసిన షేక్ వలియా సేవలు నిరుపమానమని మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకర్ అన్నారు. గురువారం ఆయన ఉద్యోగ విరమణ సత్కార సభలో మాట్లాడుతూ వలియ మాస్టారు విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దరున్నారు. పాఠశాల సిబ్బంది మరియు కాంప్లెక ఉపాధ్యాయులు మరియు ఎంటీఎస్ టీచర్లు వలియా మాస్టార్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ బాధ్యుడు సత్తిబాబు, భరత్ రాజు, వెంకటేశ్వరరావు, సుజాత, భారతి, శ్యామ్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ను ప్రారంభిస్తున్న సర్పంచ్

బేడ బుడగ జంగాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-మండపేట

బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావులు అన్నారు. గురువారం మండలంలోని ఏడిద గ్రామంలో బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ హాల్ ను స్థానిక సంఘ అధ్యక్షులు పేర్ల శ్రీను, జిల్లా అధ్యక్షులు పేర్ల దుర్గాప్రసాద్ ల ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బేడ బుడగ జంగాల సామాజిక, రాజకీయ ఎదుగుదలకు కషి చేస్తామన్నారు. అనంతరం సంఘ పెద్దలు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందడంలేదన్నారు. ప్రభుత్వం తమను గుర్తించి తమకు కుల ప్రాతిపదికన కుల ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుల ధ్రువీకరణ పత్రం తదితర సమస్యలను ఎంఎల్సి తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ బూరిగ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ పేర్ల మహేష్, మెంబర్ నామాల బంగారి, కిన్నెర దోసాలు, చెన్నూరి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల యువగళానికి మద్దతుగా ర్యాలీలు

యువగళం పేరుతో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా చేపట్టిన మహా పాదయాత్ర గురువారం నాటికి 200వ రోజులు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా డాక్టర బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయన కు మద్దతుగా ర్యాలీలు నిర్వహించారు. వివరాలు ఇవి..

ప్రజాశక్తి-యంత్రాంగం

మండపేట నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మండపేటలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయం నుండి కలవపువ్వు సెంటర్ మీదుగా కరాచీ సెంటర్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి ,పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి** నారా లోకేష్ యువగళం పాదయాత్ర నేటికి 200 రోజులు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంగాఅయినవిల్లి మండల టిడిపి అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాసురావు ఆధ్వర్యంలో తొత్తరమూడి జైభీమ్ నగర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి అయినవిల్లి సిద్ధివినాయకుని ఆలయం వరకు మూడున్నర కిలోమీటర్లు పాదయాత్ర వందలాది మందితో జరిగింది. అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ గంటి హరీష్ మాథూర్ బాలయోగి, పి.గన్నవరం నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు గారు పాల్గొన్నారు. వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డొక్కా జగన్నాధం తదితరులుపాల్గొన్నారు. **ఆత్రేయపురం** నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు సంఘీభావంగా నియోజకవర్గం లోని ఆత్రేయపురం గ్రామంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో గురువారం సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** నారా లోకేష్ పాదయాత్ర 200 రోజులకు చేరిన సందర్భంగా గురువారం రామచంద్రపురంరూరల్ మండలం తోటపేట గ్రామం నుండి ద్రాక్షారామ మాధవానంద ఫంక్షన్ హాల్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. సుబ్రహ్మణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు. **అమలాపురం** నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తయిన సందర్భంగా అల్లవరం మండలం పార్టీ కార్యాలయం వద్ద సంఘీభావంగా మాజీ ఎంఎల్ఎ, అమలాపురం అసెంబ్లీ ఇంచార్జ్ అయితా బత్తుల ఆనందరావు అల్లవరం మండలం అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. టిడిపి కార్యనిర్వాహ కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



తొత్తరమూడిలో యువగళం సంఘీభావ ర్యాలీ



మండపేటలో సంఘీభావ పాదయాత్ర చేస్తున్న టిడిపి శ్రేణులు

టిడిపిలోకి 'మేడిశెట్టి' దంపతులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని వైసిపి ఆరో వార్డు కౌన్సిలర్ మేడిశెట్టి వెంకటలక్ష్మి, ఆమె భర్త, వైసిపి నేత మేడిశెట్టి శేషారావు టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. వైసిపి నుండి ఏకగ్రీవంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన మేడిశెట్టి వెంకటలక్ష్మికి మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని మంత్రి సమక్షంలో పెద్దమనుషుల ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే గడువు పూర్తయిన తమకు చైర్మన్ పదవి పక్కకు పోవడంతో తన పదవికి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతోపాటుగా మున్సిపల్ కార్యాలయానికి తమ రాజీనామాను సమర్పించారు అయితే కౌన్సిల్ రాజీనామా ఆమోదించకపోయినప్పటికీ వారు పార్టీకి పదవికి రాజీనామా చేసి టిడిపి అధినాయకుడు సమక్షంలో ఆ పార్టీలో చేరు ఉన్నట్లు ప్రకటించారు. పారిశ్రామికవేత్తగా పట్టణంలో మంచి పట్టు ఉన్న నాయకుడిగా శేష రావు కు మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. దీంతో ఆయన వైసీపీ పార్టీకి తమ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడంతో పట్టణంలో చర్చనీయాంశమైంది

గంటిలో 'మహాశక్తి'

ప్రజాశక్తి-కొత్తపేట

మండలం గంటి గ్రామంలో జరిగిన టిడిపి ఆధ్వర్యంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి మహాశక్తి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు అభ్యున్నతి కోసం కృషి చేసేది టిడిపియేనని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.




స్వామికి శాస్త్రోక్తంగా రాఖీలు అందజేస్తున్న దృశ్యం

భీమేశ్వరాలయంలో రక్షాబంధన్

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాఖీ పౌర్ణమి సందర్భంగా భీమేశ్వరస్వామిఆలయంలో గురువారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని సాంప్రదాయంగా నిర్వహించారు. భీమేశ్వర స్వామికి వేలంపాలెంలోని గోగులమ్మ అమ్మవారి ఆలయం నుంచి రాఖీలు తీసుకువచ్చి రుత్వికులుచే భీమేశ్వరునికి కట్టించారు. కార్యక్రమంలో ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వేలం పాలెం సర్పంచ్ టేకుమూడి సుజాత ఎంపిటిసి సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య తదితరులు మహిళలు పాల్గొన్నారు.అనంతరం ఇఒకు పి.తారకేశ్వర రావుకి రాఖీలు కట్టారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

నగదు చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని బొబ్బర్లంక ఆలయంలో హుండీ పగలగొట్టి అందులోన నగదు దొంగలించిన కేసులో ఒక వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఏలిపే చందు గత నెల 25న శ్రీ రామ వయోజన సదనం వద్ద ఉన్న శ్రీరామ మందిరంలోని హుండీని తాళాన్ని బద్దలు కొట్టి అందులో ఉన్న నగదును, ఆశ్రమం తలుపులను పెకలించి గదిలో ఉన్న వంట సామాన్లను పట్టుకుపోయాడని సదనం నిర్వాహకుడు జల్లి కామేశ్వరరావు గురువారం ఫిర్యాదు చేశారు. దీనిపై చందుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతి అదశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఇంటి నుండి బయటకు వెళ్లిన కుమార్తె సాయంత్రం అయినా రాకపోవడంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు బంధువుల ఇంటి వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

సారా బట్టీలపై దాడి : ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-గోకవరం

రాజమహేంద్రవరం ఎస్ఇబి ఎఎస్పి ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందితో సారా బట్టీలపై దాడి చేసి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం ముగ్గురు వ్యక్తులు అరెస్టు చేశారు. రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన నకరబోయిన మణికంఠ స్వామి గంగంపాలెం గ్రామానికి చెందిన గంట శివకృష్ణ కామరాజుపేట గ్రామానికి చెందిన నెల్లి కృష్ణను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ముగ్గురిని రిమాండ్‌కు పంపించినట్టు ఎస్ఇబి సిబ్బంది తెలిపారు.
రైటప్:సారా కేసులో పట్టుబడిన వ్యక్తులు


సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లు

డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్స్ పట్టివేత

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం కడియపుసావరం గ్రామంలో పోలీస్ సిబ్బంది జరిపిన తనిఖీల్లో ఇంటికి ఉపయోగించవల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్స్‌ను విజేత హోటల్లో వాడుతుండగా, 4 నిండు గ్యాస్ సిలిండర్లు, 2 ఖాళీ సిలిండర్లు పట్టుకున్నారు. దీనిపై 6 ఎ కేసు నమో చేసినట్టు సివిల్ సప్లై అధికారి కెఎస్.ప్రభాకర్ తెలిపారు. ఆయనతో పాటు కడియం సిఐ పివిజి.తిలక్, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డుపైన క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం కడియపులంక 216వ నెంబర్ జాతీయ రహదారిపై డివైడర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వాహనదారులకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాలు ప్రకారం రాజమండ్రి వైపు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న బైకు రోడ్డు దాటుతున్న మరో బైకును ఢీకొనడంతో ఇద్దరు వాహనదారులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌పై రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి హైవే పెట్రోలింగ్ సిబ్బంది చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో తమ్మునిపై దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

జి.రాగంపేట గ్రామంలో దేవర దుర్గ అనే వ్యక్తి తన తమ్ముడు అప్పన్నపై కర్రతో దాడికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. గురువారం మద్యం సేవించిన అన్న దుర్గ తమ్ముడు అప్పన్న ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగాడన్నారు. మాట మాట పెరగటంతో కర్రతో తమ్ముడిపై దాడి చేశాడన్నారు. ఈ దాడిలో అప్పన్న తలకు తీవ్ర గాయాలు అయ్యాయని, వెంటనే అతనిని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారని పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌సిఐ కార్మికులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట ఎఫ్‌సిఐ గోదాముల్లో జట్టు కార్మికులుగా పనిచేస్తున్న 14 మందికి గురువారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. స్థానిక ఎఫ్‌సిఐ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైసిపి రాష్ట్ర కార్మిక నాయకుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దవులూరి సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలిండియా ఎఫ్‌సిఐ వర్కర్స్ యూనియన్ సామర్లకోట శాఖకు చెందిన 14 మంది కార్మికులు ఉద్యోగ విరమణ సభను జట్టు నాయకులు చల్లా ప్రభాకరరావు, రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, ఎఫ్‌సిఐ అసిస్టెంట్ మేనేజర్లు అవినాష్, సందీప్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి రాష్ట్ర కార్మిక నాయకుడు దవులూరి సుబ్బారావు మాట్లాడారు. 14 మంది కార్మికులు ఎఫ్‌సిఐలో డైలీ పేమేంటు విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. కార్మికులు పి.వీరభద్రరావు, పి.అప్పారావు, ఎం..మురళి, ఎం.చినవీర్రాజు, ఎం.పోలయ్య, బి.అప్పలకొండ, జి.సత్యనారాయణ, ఎం.చెల్లారావు, పి.సత్యనారాయణ, ఎం.అప్పారావు, డి.సీతారామయ్య, పి.అప్పారావు, ఎం.త్రిమూర్తులను ఘనంగా సత్కరించారు.

నవోదయ ఫలితాల్లో విక్టరీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కోటనందూరు

జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్షల్లో మండల కేంద్రమైన కోటనందూరులోని విక్టరీ స్టడీ సర్కిల్ రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ప్రతిభ కనపరిచే సత్తా చాటుకుంది. 2023 ఏడాదిలో రెండు కౌన్సిలింగ్‌లో 11 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపిక కావడంపై విక్టరీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.చిన్ని వర్షం వ్యక్తం చేశారు. ఉభయగోదావరి జిల్లాలకు అనకాపల్లి, జిల్లాలకు చెందిన 11 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయంలో చదవడానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంపిపి లగుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థిని విద్యార్థులు ప్రతిభను వెలికి తీయడానికి విక్టరీ స్టడీ సర్కిల్ ఎంత దోహద పడుతోందన్నారు. అతి తక్కువ ఫీజులతో ఉత్తమమైన విద్యను అందించడంతోపాటు పేద బలహీన వర్గాల చిన్న, సన్నకారు రైతుల పిల్లలకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడాన్ని ఆయన స్టడీ సర్కిల్ డైరెక్టర్‌ను అభినందించారు. రెండవ కౌన్సిలింగ్లో ఎంపికైన విద్యార్థులను శ్రీనివాస్ అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాస్ డైరెక్టర్ చిన్ని

తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అడ్వైజర్ కమిటీ చైర్మన్ సుర్ల లోవరాజు, సర్పంచ్ జగటాల వీరబాబు, రాంబాబు, వైసిపి నాయకులు గర్సింగు దొరబాబు, కోఆప్షన్ సభ్యులు జగటాలకోట సత్తిబాబు, ప్రసాద్, ఉపాధ్యాయులు బంటుపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల కోర్టు విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-ఏలేశ్వరం



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదులపై వరుస దాడులను నిరసిస్తూ ప్రత్తిపాడు కోర్టులో న్యాయవాదులు గురువారం విధులన బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బారు అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ అత్యంత భద్రత నడుమ కోర్టు ఆవరణలోనే న్యాయవాదిపై కాల్పులు జరిపి అంతమొందించడం, ఇటీవల బెజవాడ బార్ న్యాయవాదిపై దాడి, మరో న్యాయవాదిపై పోలీసులు అక్రమ కేసులు చూస్తుంటే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బి.మధుబాబు గౌరవాధ్యక్షుడు చెలంకూరి రామకష్ణ, ఉపాధ్యక్షుడు ఎం.గంగాధర్, స్పోర్ట్స్ కార్యదర్శి లింగంపల్లి శివకుమార్, న్యాయవాదులు కిలపర్తి శ్రీనివాస్, పలివెల నాగేంద్ర, మాదాల మంజుష, అవసరాల దేవి, రాజాల చిట్టిబాబు, గరిమెళ్ల సుబ్రహ్మణ్యం, ఆర్.వెంకట్రావు, పిల్లి బలరాముడు, ఎకెఎన్.మల్లేశ్వరరావు, బండారు నరసింహారావు, రాయి అచ్యుత రామారావు ఉన్నారు.

సేవ చేసేవారిని ప్రజలు గుర్తు పెట్టుకుంటారు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

సమాజంలో సేవ చేసే వారినే ప్రజలు గుర్తించుకుంటారని మాజీ మంత్రి, వైసిపి నాయకులు తోట నరసింహం అన్నారు. మండలంలోని రామవరంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుతగా ఆయన అనుచరులతో కలిసి కార్యకర్తలను ఆత్మీయంగా కలుసుకున్నారు. గతంలో నేను రాజకీయంలోకి రాక ముందు అన్న తోట వెంకటాచలం సూచనల మేరకు నియోజకవర్గంలోని కార్యకర్తలకు అనేక వైద్య సేవ కార్యక్రమాలు చేసేవాడినన్నారు. ఆ సేవ కార్యక్రమాలే నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చి ఎంఎల్ఎ, ఎంపీ, మంత్రిగా చేసి ప్రజల మన్ననలు పొందడం జరిగిందన్నారు. అదే తరహాలో రామవరం గ్రామానికి చెందిన యువ నాయకులు రావు గణేష్ రాజా, గుర్రం మహాలక్ష్మి ప్రజలకు అనేక వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఆ వైద్య సేవలే ప్రజల్లో గుర్తింపు పొందుతారన్నరు. ఈ కార్యక్రమంలో వైసిపి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

నాయకులు అత్తులూరి సాయి బాబు, ఎస్ఎ గఫూర్, తోట అయ్యన్న, రామకుర్తి మూర్తి, రాపేటి శ్రీను, భూపాలపట్నం బాబ్జి ఉన్నారు.

సంక్షేమ పాలన సిఎం జగన్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

పేద, అట్టడుగు వర్గాల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణ పరిధిలోని 1వ సచివాలయం పరిధిలో 2 ,3 వార్డుల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, సచివాలయ అడ్మిన్ ఎన్.రాజ్ కుమార్, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, వైస్ ఎంపిపి మిరియాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరేల్ల వీరరాఘవ, ఆకుల కృష్ణ బాపూజీ, విడదాసరి రాజా, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల


గడపగడపకు మన ప్రభుత్వంలో దొరబాబు

లక్ష్మీనారాయణ, గృహసారథుల సంఘం మండల కన్వీనర్ గోపు మురళి, నాగబోయిన రాజబాబు, లక్కాకుల కృష్ణ, శైల గణేష్, రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, చింతా శ్రీనివాసరావు, సుందర రెడ్డి రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

పిహెచ్‌సి సిబ్బందికి వైద్య సేవలపై అవగాహన

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట పిహెచ్‌సిలో గురువారం వైద్యాధికారులు వి.గౌతమి, కెఎస్.శ్రీనివాస్ లు ఆరోగ్య సిబ్బందికి వైద్యసేవలపై పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ నెలకు తప్పనిసరిగా ఐదు డెలివరీ కేసులు చేయాలన్నారు. టిబి కేసులు గుర్తించి సబ్ సెంటర్‌కు పంపాలన్నారు. లెప్రోసి మచ్చలు ఉంటే చికిత్సకు తీసుకువచ్చి వైద్యాధికారులను చూపించాలన్నారు. ఫీవర్ కేసులు పంపించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్‌ఒ బి.అప్పారావు, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.


నల్లాకు నివాళులర్పిస్తున్న మంత్రి పినిపే

నల్లా సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-అమలాపురం

నల్లా సూర్యచంద్రరావు సేవలు చిరస్మరణీయమని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. నల్లాసూర్యచంద్రరావు 11వ వర్ధంతి సందర్భముగా గురువారం అమలాపురం గడియారస్తంభం సెంటర్ లో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, వైసిపి పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ కౌన్సిలర్ సంసాని బుల్లి నాని, తుని వైసిపి పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ రుద్రరాజు నాని రాజు, కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, అల్లవరం ఎంపిపి ఇళ్ల శేషారావు, పత్తి దత్తుడు , నల్లా చిట్టి తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మిరాజు వర్గీయుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఎన్నికల ఆరు నెలలు ఉండగానే రామచంద్రపురం నియోజకవర్గం లో అభ్యర్థులు తమ బలాబలాలను ప్రదర్శించుకుంటూ జన సమీకరణలు జరుపు తున్నారు. ఎప్పటి వరకు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అనుచర వర్గం ఒక ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేయగా, వెంటనే మంత్రి వేణు వర్గం మరో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది, ఈ నేపథ్యంలో జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ గత నెలలో ఒక ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేయగా వైసిపి న్యాయవిభాగం రాష్ట్ర నాయకులు మాగాపు అమ్మిరాజు తన అనుచర గణం తో శుక్రవారం మరో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఎవరికి వారు ఆత్మీయ సమ్మేళనాలతో తమ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకునేందుకు తమ అనుచర గణాన్ని అభిమానులను కార్యకర్తలను సమావేశపరిచి తమ బలాన్ని చాటుకుంటున్నారు.

ఆదిత్యలో 'మేరీ మట్టి మేరీ దేశ్'

ప్రజాశక్తి-గండేపల్లి


మండలం ఎర్రంపాలెంలో సూరంపాలెం, ఆదిత్య ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన 'మేరీ మిట్టీ మేరీ దేశ్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల మొక్కలను ప్రభుత్వ, సచివాలయం పరిసరాల దగ్గర నాటారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్, డీన్ డాక్టర్ పిఎస్‌వి‌ఎస్.రవి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

జాతీయ తెలుగు భాషా క్రీడా దినోత్సవాలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట హైస్కూల్ నందు గురువారం హెచ్ఎం కడలి సాయిరాం అధ్యక్షతన జాతీయ తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన చంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి తెలుగు భాష క్రీడల ఔన్నత్యాన్ని పలువురు వక్తలు వివరించారు. ఈ సందర్భంగా తెలుగు భాషపై వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. అరిగెల చిన్న అందించిన రూ.7వేల ఆర్థిక సహాయంతో క్రీడా పోటీలు నిర్వహించి 96 మంది విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఉపాధ్యాయులు పెదమల్లు సత్యానందం, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు నడిమింటి సుబ్బారావు లకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి మధుబాబు, బి.వెంకటేశ్వరరావు బి.ఉమాదేవి, ఎం.సత్తిబాబు పాల్గొన్నారు.

యానాం వార్తలు


గోవా గవర్నర్‌తో పుదుచ్చేరి ఎంఎల్ఎలు

గోవా గవర్నర్‌ను కలిసిన ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి తట్టంచావిడిలో నూతనంగా అసెంబ్లీ భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో గోవా అసెంబ్లీ భవనాన్ని పరిశీలించడానికి 22 మంది ఎంఎల్ఎ బృందం గురువారం గోవాలో పర్యటించింది. పుదుచ్చేరి స్పీకర్ సెల్వం నేతృత్వంలో గోవా వెళ్లిన ఎంఎల్ఎలు గోవా అసెంబ్లీని అక్కడ ఉన్న సదుపాయాలు పరిశీలించింది. ఈ మేరకు పుదుచ్చేరి ప్రభుత్వానికి ఆయా అంశాలతో ఒక నివేదికను సమర్పించనుంది. ఈ సందర్భంగా గోవాలో రాజ్ భవన్‌కు వెళ్లి మర్యాద పూర్వకంగా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లైను కలిసింది. ఈ బందంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కూడా ఉన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న అలెక్స్ బృందం

గాయపడిన సురేష్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

ఇటీవల విశాఖ జిల్లా అనకాపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందతున్న గెడ్డం సురేష్‌కు దరియాలతిప్ప గ్రామానికి చెందిన అలెక్స్ బృందం రూ.లక్ష 30 వేల ఆర్థిక సహాయం గురువారం సురేష్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


మొక్కలు నాటుతున్న బృందం

హైస్కూల్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మండల కేంద్రంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ఉన్నత పాఠశాల వద్ద గురువారం ఆంధ్ర ప్రదేశ్ టూరిజం రీజినల్ డైరెక్టర్ రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఒంటెద్దు స్వామి నాయుడు వారి బృందం ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు పెంపకం, ప్లాస్టిక్ నివారించుట, స్వదేశీ వస్తువుల వాడకం, సైకిల్ రేస్,ఆర్ట్ ,క్రాఫ్ట్ పరికరాల తయారుచేయుట వంటి అంశాలు లో విద్యార్థులకు అవగాహన కల్పించి పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసారు. ఈ ర్యక్రమంలో జిల్లా టూరిజం ఆఫీసర్ పి.వెంకటాచలం, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీధి సురేష్ బాబు, సైన్స్ టీచర్ ఎమ్ శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న దర్శించుకున్న జానారెడ్డి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామిని గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి జానా రెడ్డి దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈయనకు తొలుత అర్చకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈయన వెంట ఆలయ మాజీ చైర్మన్ కరటూరి నరసింహారావు తదితరులు ఉన్నారు.

రైతులకు కిసాన్ డ్రోన్లు ఏవీ..?

రాయితీపై ఇస్తామంటున్న ప్రభుత్వం
నిబంధనలతో రైతులు అనాశక్తి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

టెక్నాలజీను వినియోగించి వ్యవసాయ రంగంలో మరింత పురోగతిని సాధించడంతో బాటు, రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చి ఎరువులు, పురుగుల మందుల పిచికారీను సులభం చేయడం కోసం కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తీసుకు వస్తామని ప్రభుత్వం చెప్పింది. జిల్లా వ్యవసాయ శాఖ ఈ ఏడాది ఖరీఫ్ నుంచి వీటిని వినియోగించాలని భావించారు. అందుకోసం రాయితీపై అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ పలు నిబంధనలు వలన డ్రోన్ల కొనుగోలుపై రైతులు ఆసక్తి చూపడం లేదు.

జిల్లాలో ఈ ఏడాది 2.30 లక్షల ఎకరాల్లో వరి, పత్తి 10,237 ఎకరాలు, చెరకు 9,387 ఎకరాలు, మినుములు 2,811, మొక్కజొన్న 595, కందుల 382, నువ్వులు 230, వేరుశెనగ 17 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.పంటలకు చీడపీడలు ఆశించడం వల్ల రైతులు పెద్ద ఎత్తున పంటలను నష్టపోతున్నారు. మరోవైపు అధిక ధరలకు పురుగుల మందులను కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నా పూర్తిస్థాయిలో పంటకు స్ప్రే కాకపోవడంతో చీడపీడలు వదలడం లేదు. ఈ నేపథ్యంలో నిముషాల వ్యవధిలోనే సంపూర్తిగా మందులను పిచికారీ చేసేందుకు వీలు కలుగుతుందని భావించిన ప్రభుత్వం డ్రోన్లను అందుబాటులోకి తీసుకు రానుంది. ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తూ ఆశించిన ఫలితాలను సాధిస్తున్నారని వ్యవసాయ శాఖ చెబుతోంది. భవిష్యత్తులో ద్రవరూపంలో వచ్చే నానో యూరియా, డీఏపీ ఎరువులకు దీన్ని ఉపయోగించుకునే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. ఎకరాకు కేవలం రూ.100 ఖర్చుతోనే క్రిమిసంహారక మందులు పిచికారీ చేయొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ డ్రోన్ కొనుగోలు చేసిన రైతులు తమ సొంత పొలాల్లోనే కాక ఇతర రైతుల పంటలకు వినియోగించడం వల్ల రోజుకు కనీసం 10 ఎకరాల్లో పిచికారీ చేసినా రూ.4 వేల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వీటి వినియోగంపై రైతుల్లో ఆసక్తి పెంచేందుకు డ్రోన్ ధరలో 40 శాతం రాయితీ ఇస్తారు. అంటే డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు అయితే దీనిలో రూ. 4 లక్షలు రాయితీగా ఇవ్వగా రూ.లక్ష రైతు చెల్లించాలి. మిగిలిన రూ.5 లక్షలు బ్యాంకుల నుంచి రుణం ఇస్తారు. దీనిలో భాగంగా ఎంపిక చేసిన కొంతమంది యువ రైతులకు ఇప్పటికే గుంటూరులోని ఎన్. జి.రంగా యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చారు. కాకినాడ జిల్లాలో 25 మందికి గానూ ఇప్పటి వరకు 18 మందికి శిక్షణ పూర్తి అయింది. ఒక్కో మండలానికి మూడు డ్రోన్లు ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.తొలి విడతలో జిల్లా వ్యాప్తంగా 25 డ్రోన్లు ఇవ్వాలని



ప్రతిపాదనలు పంపారు.అయితే విధి విధానాలను రావాల్సి ఉంది.

నిబంధనలతో ముందుకు రాని రైతులు

రైతులను గ్రూపులుగా విభజించి డ్రోన్లను రాయితీపై ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. డ్రోన్ ఆపరేటింగ్ చేసే వ్యక్తి డిప్లొమా, ఇంజనీరింగ్ చేయాలని నిబంధన మొదట్లో విధించారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఈ చదువులు చదివే అవకాశం లేనందున పదో తరగతి, ఇంటర్ చదివినవారిని అర్హులుగా పేర్కొన్నారు. ఈ విద్యార్హతలతో పాటు గ్రూపులో ఒకరికి ఖచ్చితంగా పాస్ పోర్ట్ ఉండాలనే నిబంధన విధించారు. పాస్ పోర్ట్ సమస్యలు వల్ల డ్రోన్ కొనుగోలుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి డ్రోన్లను ఉపయోగలోకి తీసుకురావాలని ప్రభుత్వ ఆలోచనలు క్షేత్రస్థాయిలో ఆయా నిబంధనల వల్ల అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో కిసాన్ డ్రోన్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు.